సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 23 : ఆగస్టు : 2024



జాగిలాలతో గాంజా గుట్టు..

రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో పోలీసులు జాగిలాల సాయంతో గంజాయిని గుర్తిస్తున్నారు.

8లో



ఆంగ్ల భాషపై నైపుణ్యం..

విద్యార్థుల్లో ఆంగ్లభాషపై నైపుణ్యం పెంపొందించేలా కృషి చేయాలని మైనారిటీ సంక్షేమ అధికారి సూచించారు.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కనుల పండువగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణం గురువారం కమనీయంగా జరిగింది. భద్రాచల రామాలయంలో తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

నేటి నుంచి భాగవత పారాయణం

త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారు శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు శ్రీమద్ భాగవత సప్తాహం ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవస్థాన ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ పారాయణం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

అలింకో క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



క్యాంపు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 27న ఆనందఖని(కొత్తగూడెం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే అలింకో నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. గురువారం శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దివ్యాంగులైన 18 సంవత్సరాల లోపు పిల్లలు క్యాంపునకు హాజరైతే ఉచితంగా పరికరాలు, ఉపకరణాలు పొందేందుకు ఎంపికవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు, జెండర్ కోఆర్డినేటర్ జె.అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేస్తాం

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్యకు సన్మానం



అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరయ్యతోపాటు భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు వెంకట్రావు, రాందాస్‌లను సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

భద్రాచలం: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేస్తామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య గురువారం తొలిసారిగా భద్రాచలం వచ్చారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికాయి. బాణసంచా పేల్చుతూ, కోలాటాలు, గిరిజన కొమ్ము నృత్యాల నడుమ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్ల రోడ్డులో ఉన్న ఫంక్షన్‌హాల్‌ ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌నే నమ్ముకుని వీర విధేయుడిగా ఉన్న పొదెం వీరయ్యకు పార్టీ సరైన సమయంలో కార్పొరేషన్ పదవితో గుర్తింపు ఇచ్చిందని అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయ ప్రయాణం చేసిన వీరయ్య అభినందనీయుడని అన్నారు. అనంతరం అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, ఏజెన్సీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మంత్రుల సహకారంతో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, టీడీపీ నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల, గిరిజన, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘భగీరథ’కు బ్రేక్..



పెద్దమ్మగుడి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ పగలడంతో ఏర్పడిన గుంత

రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు నిలిచిన తాగునీటి సరఫరా

- పగిలిన మిషన్ భగీరథ తాగునీటి ప్రధాన పైపులైన్
- మరమ్మతులు పూర్తిచేసి రేపటిలోగా నీళ్లు అందించేందుకు అధికారుల చర్యలు



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఈఈ నళిని, డీఈ సాయి తదితరులు

పాల్వంచరూరల్: ఇంటింటికీ గోదావరి జలాలను అందించే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అశ్వాపురం మండలంలో భగీరథ ఇన్‌టేక్‌వెల్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి తోగ్గూడెం గ్రిడ్‌కు గోదావరి జలాలను సరఫరా చేస్తున్నారు. తోగ్గూడెంలోని నీటిశుద్ధి కేంద్రం(గ్రిడ్)లో శుద్ధి చేసి పైపులైన్ ద్వారా వివిధ ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. అయితే పెద్దమ్మగుడి వెనుక మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ బుధవారం రాత్రి 11:30 గంటలకు పగిలిపోయింది. దీంతో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతోపాటు లక్ష్మీదేవిపల్లి, చంచుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలాలకు గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా జిల్లాకేంద్రం, ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. మరమ్మతులు నిర్వహించాక 24 నుంచి తాగునీటి సరఫరా జరుగుతుందని గ్రిడ్ అధికారులు తెలిపారు.

పరిశీలించిన గ్రిడ్ ఈఈ, డీఈలు

పెద్దమ్మగుడి వెనుక పగిలిన మిషన్ భగీరథ ప్రధాన తాగునీటి పైపులైన్‌ను గురువారం గ్రిడ్ ఈఈ నళిని, డీఈ సాయి సందర్శించి పరిశీలించారు. పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యే వరకు రెండు మున్సిపాలిటీలకు, ఐదు మండలాలకు తాగునీటి సరరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. పైపులైన్‌కు తాత్కాలికంగా రూ.2 లక్షల అంచనా వ్యయంతో ఎయిర్‌వాల్వ్ ఏర్పాటు చేసి మరమ్మతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తోగ్గూడెం గ్రిడ్ నుంచి సుజాతనగర్ వరకు పైపులైన్

పాల్వంచ మండలం తోగ్గూడెంలోని మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి జగన్నాథపురం, పెద్దమ్మగుడి వెనుక నుంచి కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మీదుగా లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, చంచుపల్లి, సుజాతనగర్ వరకు నిర్మించారు. నిత్యం ఈ పైపులైన్ నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. పెద్దమ్మగుడి వెనుక పైపులైన్‌కు దగ్గర, దగ్గర బెండ్లు వేయడం, పీసీసీపీ(ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ సిలిండర్ పైప్) పైపులైన్ బెండ్ వద్ద ఎయిర్ వాల్స్ లేకపోవడంతో నీటి ఉధృతికి లీకై పైపు మూడు అడుగుల మేర పగిలిపోయింది. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వగా, సంబంధిత అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. అప్పటికే పైపులైన్ పగిలిన ప్రదేశంలో పంటపొలాలు నీటమునిగి, ఇసుక మేటలు వేశాయి.

పరిహారం చెల్లిస్తామని హామీ

పైపులైన్ పగిలిపోవడంతో నీరంత ఒక్కసారిగా ఎగసిపడి సమీపంలోని పంతిని పరంధామయ్య, నరేష్‌ల పంట పొలాలు కొట్టుకుపోయాయి. కొంత మేర ఇసుక మేట వేసింది. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాకే మరమ్మతులు నిర్వహించాలని బాధిత రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో పరిహారం చెల్లిస్తామని పైపులైన్ కాంట్రాక్టర్, అధికారులు హామీ ఇచ్చారు.

రూ.15 కోట్లతో అలైన్‌మెంట్ మార్పు..

అటవీశాఖ అనుమతులు రాని కారణంగా మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌ను తోగ్గూడెం గ్రిడ్ నుంచి పెద్దమ్మగుడి వెనుక నుంచి నిర్మించారు. దీంతో మూలమలుపులు అధికంగా ఉండటంతోపాటు జిల్లాలో ఎక్కడా లేనివిధంగా దగ్గర, దగ్గర బెండ్లను ఏర్పాటు చేశారు. దీంతో నీటి ఉధృతికి పైపులైన్ తరచూ లీకవుతోంది. కేశవాపురం వద్ద కూడా పలుమార్లు పైపులైన్ లీకైంది. ప్రమాదం జరిగినప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే రూ.15 కోట్లతో గ్రిడ్ గుట్ట నుంచి మూడు కిలోమీటర్ల వరకు ప్రత్యామ్నాయంగా పైపులైన్ నిర్మించాలి. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు పంపనున్నట్లు డీఈ సాయి తెలిపారు.

ఒకే రోజు 51,035 మొక్కలు..



చింతలతండాలో మునగ మొక్క నాటుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

- అట్టహాసంగా అమ్మకోసం మొక్క నాటే కార్యక్రమం
- జూలూరుపాడులో మునగ మొక్క నాటిన కలెక్టర్ జితేష్
- ప్రధాని మోదీ స్ఫూర్తితో జిల్లాలో విజయవంతం

నియోజకవర్గం	నాటిన మొక్కలు
అశ్వారావుపేట	8,991
భద్రాచలం	10,211
పినపాక	7,937
కొత్తగూడెం	8,885
ఇల్లెందు	14,256
వైరా(జూలూరుపాడు)	755

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుంబిగించాలని, ప్రతి ఒక్కరూ తమ తల్లి గౌరవార్థం ఒక మొక్కను నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఓ మొక్కను నాటి, ఆమెతో ఫొటో దిగి లేదా ఆమె ఫొటోతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టాలని సూచించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన తల్లి పేరిట మొక్క నాటారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని అమ్మ కోసం గురువారం దేశవ్యాప్తంగా మొక్కను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ సంక్షేమ మంత్రిత్వశాఖలు పిలుపునిచ్చాయి. దీనిపై రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ సైతం కచ్చితమైన ఆదేశాలు జారీ చేయటంతో జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని అధికారులు కోలాహలంగా నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జూలూరుపాడు మండలంలోని చింతలతండా గ్రామంలో అమ్మ పేరు మీద మునగ మొక్కను నాటారు. జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు సైతం అమ్మకోసం మొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అమ్మ కోసం–ఒక మొక్క నాటే కార్యక్రమంపై జోరుగా ప్రచారం చేస్తుండగా, ఈ బృహత్తర కార్యక్రమంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, అటవీశాఖ, హార్టీకల్చర్, వ్యవసాయ శాఖ, సామాజిక సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, స్వయం సహాయక సంఘాల మహిళలు భాగస్వాములయ్యారు.

తరతరాలకు స్ఫూర్తినిచ్చేలా..

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు హరిత నర్సరీల ద్వారా మొక్కలను సమకూర్చగా, గురువారం జిల్లా వ్యాప్తంగా 51,035 మొక్కలను నాటారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పొలంగట్లు, పల్లె ప్రకృతి వనాలతోపాటు రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటారు.

విజయవంతంగా నిర్వహించాం

అందరి సహకారంతో అమ్మకోసం.. ఒక మొక్క కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాం. జిల్లా వ్యాప్తంగా 51,035 లక్షల మొక్కలు పంపిణీ చేసి నాటించాం. ముందుగానే నర్సరీల్లోని మొక్కలను గ్రామాలు, పట్టణాలకు తరలించాం. ఈ కార్యక్రమంలో యువకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారు.

–ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

మునగ సాగును ప్రోత్సహించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- పలు గ్రామ పంచాయతీల సందర్శన



కొమ్ముగూడెం పశువైద్యశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

జూలూరుపాడు: రైతులు మునగ సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం జూలూరుపాడు మండలంలోని చింతలతండా, భేతాళపాడు, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలను కలెక్టర్ సందర్శించారు. చింతలతండా గ్రామానికి చెందిన భూక్యా దేవా అనే రైతు మునగ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ‘నాటుదాం ఒక చెట్టు– అమ్మ కోసం’ కార్యక్రమంలో భాగంగా మునగ మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మునగ సాగులాభదాయకంగా ఉంటుందన్నారు. భేతాళపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్మించిన ఇంకుడు గుంత, అజోల్లా సాగును పరిశీలించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. రేగళ్లతండా, మాచినేనిపేటతండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, కొత్త భవనం, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంత పరిశీలించారు. కొమ్ముగూడెం పశువైద్యశాలను తనిఖీ చేసి, శిథిలావస్థలో ఉన్నందున నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. జూలూరుపాడు మండలంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యా చందన, అసిస్టెంట్ డీఆర్డీఓ రవి, ఎంపీడీఓ డి కరుణాకర్ రెడ్డి, ఎంపీఓ తులసిరామ్, ఈజీఎస్ ఏపీఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు



ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, నాయకులు

మణుగూరు రూరల్ : ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రెండు పంటలకు ఇవ్వాల్సిన రైతుబంధును ఎగ్గొట్టి ఆ డబ్బులను రుణమాఫీ కింద ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు ఇచ్చి రైతుల వెన్నుదన్నుగా నిలిచామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, మేకల రవి, ప్రభాకర్, వీరమనేని చెన్నకేశవులు, అక్కి నర్సింహారావు, రామకోటి, యువజన నాయకులు హర్షనాయుడు, గుర్రం సృజన్, బోశెట్టి రవిప్రసాద్, సురేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

స్పందనలేని విద్యుత్ ప్రజావాణి

- జిల్లావ్యాప్తంగా నాలుగుకు మించని దరఖాస్తులు
- సమస్యలున్నా ఫిర్యాదు చేయని వినియోగదారులు
- అదే రోజు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో కూడా గ్రీవెన్స్..



వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ వినియోగదారులు(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఆ శాఖ చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నట్లే విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ ప్రజావాణి నిర్వహించాలని ఆ శాఖ నిర్ణయించింది. టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో అన్ని ప్రధాన కార్యాలయాల్లో ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం చేపట్టాలని అధికారులు ఆదేశించారు. సర్కిల్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాలు, ఈఆర్‌ఓ, సబ్ డివిజన్ కార్యాలయాలు, సెక్షన్ ఆఫీసుల్లో జూన్ 17న ప్రారంభించారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్కిల్ కార్యాలయం మినహా అన్ని విద్యుత్ కార్యాలయాల్లో, సర్కిల్ ఆఫీసులో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు.

తొలిసారి 35 ఫిర్యాదులు

తొలి విద్యుత్ ప్రజావాణి 30 సెక్షన్ కార్యాలయాలు, ఆరు ఈఆర్‌ఓ కార్యాలయాలు, 9 సబ్ డివిజన్ ఆఫీసులు, 3 డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయంలో నిర్వహించగా 35 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సెక్షన్ కార్యాలయాలకు 34 దరఖాస్తులు, పాల్వంచ ఈఆర్‌ఓ కార్యాలయానికి ఒక దరఖాస్తు వచ్చాయి. సబ్ డివిజన్ కార్యాలయాలకు, సర్కిల్ కార్యాలయంలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సెక్షన్ ఆఫీసర్ల కార్యాలయాలు 30 ఉండగా 15 కార్యాలయాల్లో మాత్రమే దరఖాస్తులు అందాయి. మొత్తం 35 దరఖాస్తుల్లో 13 సమస్యలను అధికారులు అదేరోజు పరిష్కరించారు. తర్వాత సోమవారం కేవలం 6 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మూడో ప్రజావాణిలో 4 దరఖాస్తులు వచ్చాయి. రెండో విద్యుత్ ప్రజావాణి నుంచి దరఖాస్తులు నాలుగు కంటే మించడంలేదు.

ఎందుకిలా..?

విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నప్పటికీ దరఖాస్తులు రాకపోవడానికి కారణం అదేరోజు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం వల్ల స్పందన రావడంలేదనే ప్రచారం సాగుతోంది. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై కూడా దరఖాస్తులు ప్రజలు అందజేస్తున్నారు. కానీ విద్యుత్ ప్రజావాణికి కనీసం పదుల సంఖ్యలో కూడా దరఖాస్తులు రాకపోవడం గమనార్హం. ప్రజావాణి కార్యక్రమంపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా.. విద్యుత్ ప్రజావాణితోపాటు సైట్, యాప్ కలెక్టరేట్ ప్రజావాణితో కలిపి జూన్ 17 నుంచి ఈ నెల 22వ తేదీ వరకు భద్రాచలం డివిజన్ నుంచి 83 దరఖాస్తులు రాగా 76 సమస్యలను పరిష్కరించామని, ఇంకా 7 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కొత్తగూడెం డివిజన్ నుంచి 177 దరఖాస్తులు రాగా, 141 దరఖాస్తులను పరిష్కరించామని పేర్కొన్నారు. ఇంకా 36 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మొత్తంగా 260 దరఖాస్తులు రాగా 217 సమస్యలను పరిష్కరించామని, 43 పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు.

నిండుకున్న ఔషధాలు!

- ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత
- జ్వరాలతో పెరిగిన మందుల వినియోగం
- డిమాండ్‌కు తగిన సరఫరాలేని వైనం



ఆస్పత్రిలో ఖాళీగా దర్శనమిస్తున్న మందుల నిల్వ ర్యాక్‌లు

ఇల్లెందురూరల్: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రులకు వచ్చిన బాధితులకు మందులు లభించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 34 పీహెచ్‌సీలు ఉండగా, వీటిల్లో 15 పీహెచ్‌సీలు 24 గంటలపాటు సేవలందిస్తున్నాయి. 19 పీహెచ్‌సీలు 12 గంటలపాటు సేవలందిస్తున్నాయి. వీటితోపాటు 4 యూఎఫ్‌డబ్ల్యూసీ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రతి ఆస్పత్రిలో రోజూ 200కు మించి ఓపీ నమోదవుతోంది. బాధితులకు టైఫాయిడ్‌తోపాటు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అత్యధికంగా టైఫాయిడ్ కేసులు నమోదవుతుండగా, వైద్యులు ఎక్కువ మందికి టైఫాయిడ్ పరీక్షలు చేస్తున్నారు. కానీ టైఫాయిడ్ కిట్ల సరఫరా లేకపోవడంతో ప్రస్తుతం పరీక్షలు నిలిపివేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. జ్వర బాధితులకు నీరసం తగ్గేందుకు బలానికి సంబంధించిన మందులు, కీళ్ల నొప్పుల నివారణకు అవసరమైన పెయిన్ కిల్లర్ మందులు పీహెచ్‌సీలలో నిండుకున్నాయి. యాంటిబయాటిక్, జలుబు, దగ్గు తదితర మాత్రల కొరత కూడా వేధిస్తోంది. కేవలం పారాసిటమాల్, ఇతరత్రా ఉపశమనం కలిగించే మందులు మాత్రమే ఇచ్చి రోగులను ఇంటికి పంపుతున్నారు. ఇక చిన్నపిల్లలకు అవసరమైన జలుబు, దగ్గు, జ్వరం, యాంటిబయాటిక్ టానిక్‌లు పూర్తిగా అడుగంటాయి. దీంతో పేదలు ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందులు లేకపోవడంతో పలువురు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

మరో పది రోజులు గడిస్తే మందు బిళ్ల దొరకదు

గతంలో నియోజకవర్గ కేంద్రాల్లోని ఆస్పత్రుల నుంచి ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, సబ్‌సెంటర్లకు మందులు అందించేవారు. ప్రస్తుతం పీహెచ్‌సీల నుంచే అందించాల్సి వస్తుండటంతో మందుల వినియోగం పెరిగింది. జ్వరాల సీజన్‌కావడంతో ఓపీ, ఇన్‌పేషంట్ల సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో డిమాండ్ తగిన సరఫరా లేక పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఏర్పడింది. మందులు కావాలని జిల్లా డ్రగ్ స్టోరేజ్ యూనిట్‌కు ఇండెంట్ పెడితే అక్కడ కూడా నిల్వలు లేవు. దీంతో సమీపంలోని పీహెచ్‌సీల నుంచి మందులను ఇచ్చిపుచ్చుకుంటూ వైద్యులు కాలం నెట్టుకొస్తున్నారు. మరో పది రోజులైతే టాబ్లెట్లు దొరకని పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.

కొరత వాస్తవమే

జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో మందుల కొరత ఉంది. జిల్లా స్టోరేజ్ యూనిట్‌లో ఉన్న మందులను అన్ని ఆస్పత్రులకు సర్దుబాటు చేస్తున్నాం. అవసరమైన మందుల వివరాలతో రాష్ట్ర స్థాయిలో ఇండెంట్ పెట్టాం. త్వరలోనే కొరతను నివారిస్తాం.

–డాక్టర్ భాస్కర్ నాయక్, డీఎంహెచ్‌ఓ

నిపుణుల కమిటీలో భద్రాచలంవాసి

భద్రాచలంఅర్బన్: ఉత్తమ అనువాద గ్రంథాల ప్రాథమిక స్థాయి జాబితాను తయారు చేసే నిపుణుల కమిటీలో భద్రాచలం పట్టణానికి చెందిన రచయిత, అనువాదకులు కేవీవీఎస్ మూర్తిని సభ్యుడిగా కేంద్ర సాహిత్య అకాడమీ కమిటీ నియమించింది. ఈ సందర్భంగా మూర్తిని సాహితీవేత్తలు అభినందించారు. కమిటీ సభ్యులు 2018 నుంచి 2022 మధ్య కాలంలో వెలువడిన ఉత్తమ అనువాద గ్రంథాలను సేకరించి ఢిల్లీలో ఉన్న కేంద్ర సాహిత్య అకాడమీకి అందజేయనున్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు.

జాగిలాలతో గాంజా గుట్టు రట్టు..!

- మాదకద్రవ్యాలను అరికట్టడంలో 'నార్కోటిక్స్' సేవలు
- జిల్లాలో 11 పోలీసు జాగిలాల సేవలు
- కొత్తగూడెంలో 10, భద్రాచలం ఆలయం వద్ద ఒకటి
- గాంజా గుర్తింపులో గ్రేసీ, రీనాలకు అవార్డులు
- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు


కొత్తగూడెం పార్కులో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: నేరం జరిగిందన్న వార్త అందితే చాలు పోలీసులతో పాటు జాగిలాలు(కుక్కలు) కూడా సంఘటన స్థలానికి చేరుకుని తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. వాసన పసిగట్టి దొంగలను, గంజాయి(గాంజా)ను పట్టుకోవడంలో అవి పోలీసులకు సహాయంగా నిలుస్తూ నిందితులు, సొత్తును పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఏరియాలోని ఐఐటీఏ (ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ)లో శిక్షణ పొందిన 11 జాగిలాలు పోలీసులకు అండగా నిలుస్తున్నాయి. గంజాయి రహిత జిల్లాగా మారుస్తామంటూ పోలీసులు చేస్తున్న తనిఖీల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై చివరి వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపులు, నిర్మానుష్య ప్రాంతాలు, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు, రహదారులు వంటి చోట్ల గంజాయి గుర్తించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో పోలీసు జాగిలాలు గంజాయి మత్తుపదార్థాలను గుర్తించి సరుకులు, గంజాయిని సేవించిన వారిని గుర్తించడంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

జిల్లాలో 11 పోలీస్ డాగ్స్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హైదరాబాద్‌లోని ఐఐటీఏలో నార్కోటిక్స్, ఎక్స్‌ప్లోజివ్స్, క్రైం విభాగాల్లో ఎనిమిది నెలల పాటు శిక్షణ పొందిన 11 జాగిలాలు కలవు. కొత్తగూడెంలో నార్కోటిక్ డాగ్స్ 2, ఎక్స్‌ప్లోజివ్ డాగ్స్ 07, క్రైం (ట్రాకర్ విభాగంలో) 2 ఉన్నాయి. అయితే పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు స్నిపర్ డాగ్స్ (ఎక్స్‌ప్లోజివ్ డాగ్స్) ఉపయోగపడతాయి. కాగా, నార్కోటిక్ విభాగంలో గంజాయిని గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్స్ గ్రేసీ, రీనాలు కీలకంగా సేవలను అందిస్తున్నాయి. ఇవి గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు శిక్షణ పొందగా.. శిక్షణలో పోటీ పడ్డ 15కు పైగా నార్కోటిక్స్ డాగ్స్‌లో జిల్లాకు చెందిన గ్రేసీ బంగారం, రీనా సిల్వర్ మెడల్ సాధించడం విశేషం. కాగా, గ్రేసీకి హ్యాండ్లర్(మాస్టర్)గా కానిస్టేబుల్ టి.వెంకటేష్,, రీనాకు హెడ్ కానిస్టేబల్ ఎస్‌కె.నాగుల్‌మీరా వ్యవహరిస్తున్నారు. బెల్జియం మిలనాయిస్ జాతికి చెందిన వీటికి 2 ఏళ్ల 6 నెలలు ఉంటుంది.

వాసన పసిగట్టడంలో దిట్ట..

ఈ జాగిలాలు పోలీసుశాఖలో ఎనిమిది నెలలు ప్రత్యేకంగా శిక్షణ పొంది వాసన గుర్తించడంలో మరింతగా నైపుణ్యం కలిగి ఉంటాయి. బ్యాగులు, వాహనాలు, మనుషుల దుస్తులు, భూమి లోపల, సూట్ కేసు వంటి వాటిలో ఉన్న గంజాయిని ఇట్టే పసిగట్టేస్తాయి. మాదకద్రవ్యాలు, కొకైన్, మెంతమ్, మారుజానా, హెరాయిన్, ఓపీఎం (నల్లమందు), గాంజా వంటి వాటిని వాసనను బట్టి గుర్తించి పట్టిస్తాయి. కాగా, ఇవి శిక్షణ కాలంలో రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయమాలు వాకింగ్, గ్రూమింగ్, ప్రాక్టీస్ చేయిస్తారు. రాయల్ కెనైన్ మాక్సి అడల్ట్ ఆహారం ఒక్కపూటకు 250 గ్రాముల చొప్పున రోజుకు 500 గ్రాములు ఆహారాన్ని అందిస్తారు.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం..



గంజాయి రహిత జిల్లాగా మార్చడమే మా ప్రధాన ధ్యేయం. గంజాయి సమాచారం తెలిస్తే డయల్ 100తో పాటు 87126 82133, 87126 82135లకు ఫోన్ చేయండి. గంజాయి నిర్మూలనకు పోలీసులకు ప్రజల సహకారం అవసరం. గంజాయి రవాణా, వాడకాన్ని గుర్తించడంలో గ్రేసీ, రీనాలు సేవలను వినియోగిస్తున్నాం. గంజాయి నిర్మూలనకు ప్రతీ ప్రాంతంలో నిరంతర తనిఖీలను పకడ్బందీగా చేపడుతున్నాం.
– బి.రోహిత్‌రాజు, ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

చట్టాలపై అవగాహన ఉండాలి

భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

భద్రాచలఅర్బన్: వయోవృద్ధులు తమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సీనియర్ సిటిజెన్స్ డే సందర్భంగా పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత కమిటీ ఆధ్వర్యాన ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ..వృద్ధులు, వయో వృద్ధులు తమకు కల్పించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ది మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజెన్స్ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సాయం కోసం మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని సూచించారు. అనంతరం భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, భద్రాచలం టౌన్ సీఐ సంజీవ రావులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీ పేరాల వెంకటేశ్వర్లు, శ్రీ పామరాజు తిరుమలరావు, శ్రీ ఎం.వి.రమ, భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్ ఎల్వీ ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి, నాలం సత్యనారాయణ, ఐ.వి.సత్యనారాయణ, అక్కయ్య, వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై నైపుణ్యం పెంచాలి


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంచాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు అన్నారు. గురువారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి అధ్యక్షతన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లిష్‌లోకి కొత్తగా ప్రమోట్ అయిన 25 మంది స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా విద్యాశాఖ, అసోసియేషన్ సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, దేశ భవిష్యత్తును నిర్మించే అవకాశం టీచర్లకు దక్కుతుందన్నారు. రిసోర్స్ పర్సన్లు ఇచ్చిన శిక్షణను నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ ఏఎంఓ నాగరాజశేఖర్, ఆంగ్ల రిసోర్స్ పర్సన్లు ఎస్‌డీ రవిప్రతాప్, షేక్ మీరా హుస్సేన్, కర్లపూడి సైదులు, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ షరీఫ్, సభ్యులు జయదాసు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రణాళికల ప్రకారం బోధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న మల్టీజోన్‌-1 అధికారి అలివేలు

పాల్వంచరూరల్: గురుకుల విద్యాలయాల్లో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం బోధించాలని మల్టీజోన్‌-1 అధికారి అలివేలు ఆదేశించారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను గురువారం ఆమె సందర్శించారు. మెనూ అమలు తీరును, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'రియాక్టర్' ఘటనలో మండల వాసి దుర్మరణం

అశ్వారావుపేటరూరల్: ఏపీలోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద గల ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ప్రమాద ఘటనలో అశ్వారావుపేట మండలం గంగారం గ్రామానికి చెందిన మార్ని సురేంద్ర(37) మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. సురేంద్ర విశాఖపట్నంలోని గాజువాకలో నివాసం ఉంటూ గడిచిన తొమ్మిదేళ్లుగా అచ్యుతాపురంలో గల ఫార్మా సెజ్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. రియాక్టర్ పేలుడు ప్రమాదంలో చిక్కుకుని దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని గురువారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తెతో పాటు తల్లి జమున ఉన్నారు.

ఒక్కగానొక్క కొడుకు..


సురేంద్ర (ఫైల్)

అశ్వారావుపేట మండలం గంగారం గ్రామానికి చెందిన మార్ని కృష్ణారావు, భార్య జమున దంపతులకు సురేంద్ర ఒక్కగానొక్క కొడుకు. తండ్రి కృష్ణారావు చిన్నప్పుడే మృతి చెందడంతో తల్లి ఒక్కతే సురేంద్రను ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) వరకు చదివించింది. దీంతో ఆ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం రావడంతో గత తొమ్మిదేళ్లుగా అదే కంపెనీలో పని చేస్తుండగా.. ఈ పేలుడు సంభవించి మృత్యువాత పడ్డాడు. సురేంద్ర మృతితో కుటుంబానికి ఆధారం లేకుండా పోయిందని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

25తో ముగుస్తున్న డీఈడీ ప్రవేశాలు

భద్రాచలంఅర్బన్: గిరిజన డీఎల్ఈడీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వైకేడీ భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏజెన్సీ ప్రాంతవాసులై ఇంటర్మీడియట్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలన్నారు. దరఖాస్తులను భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులోని డీఎల్ఈడీ కళాశాలలో ఇవ్వాలని, మరిన్ని వివరాలకు 99595 75539, 79812 55624 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

70 బస్తాల యూరియా పట్టివేత


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామంలో 70 బస్తాల యూరియాను గురువారం రాత్రి డంప్ చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారంతో కొమరారం ఎస్సై సోమేశ్వర్ పట్టుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందు పీఏసీఎస్‌కు చెందిన గోదాం నుంచి బొలెరో వాహనంలో 70 బస్తాల యూరియాను రాత్రి సమయాన మాణిక్యారం గ్రామానికి తరలించారు. అక్కడ డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావుకు చెందిన గోదాంలో డంప్ చేస్తుండగా.. సమాచారం మేరకు ఎస్సై అక్కడకు చేరుకొని తనిఖీ చేయగా.. సరైన ఆధారాలు లేకపోవడంతో ఏఓ సతీష్‌కు సమాచారం అందించారు. కొనుగోలు చేస్తే రైతు పేరిట రశీదులు ఉంటాయని లేనిపక్షంలో ఆ బస్తాలను స్వాధీనం చేసుకోవచ్చని ఏఓ తెలపడంతో ఎస్సై వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా యూరియా లోడ్ వచ్చిన మరొక వాహనాన్ని పోలీసుల వస్తున్న సమాచారంతో దారి మళ్లించినట్లు ప్రచారం జరుగుతోంది.

వివాహిత అదృశ్యం

ఇల్లెందు: అన్నయ్యకు రాఖీ కట్టేందుకు వచ్చి మరుసటి రోజున తిరిగి అత్తగారింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఓ వివాహిత నేటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గత నెలలో స్టేషన్ బస్తీకి చెందిన ప్రియా అనే యువతికి కృష్ణా జిల్లా కొండముక్కల గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. ఈ నెల 19న సోదరులకు రాఖీ కట్టేందుకు స్టేషన్ బస్తీకి వచ్చింది. రాఖీ కట్టి మరుసటి రోజు అత్తారింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది కాని ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ తుల్సిరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: మండల పరిధి తోగ్గూడెం గ్రామానికి చెందిన బొర్రా వెంకటేష్(30) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఈక్రమంలో అతడి ఆరోగ్యం బాగలేకపోవడంతో గురువారం ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై ఎస్ఐ సురేష్‌ను వివరణకోరగా.. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అనారోగ్యంతో మృతిచెందాడని కుటుంబీలకులు తెలిపినట్లు చెప్పారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


సారయ్య (ఫైల్)

కరకగూడెం: మద్యానికి డబ్బులివ్వలేదని ఓ వ్యక్తి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను కరకగూడెం ఎస్సై రాజేందర్ ఇలా తెలిపారు. మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన మంద సారయ్య(50) ఈ నెల 19న రాఖీ పండుగ కావడంతో మద్యానికి తన భార్య వెంకటమ్మను రూ.100 అడుగగా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో వెంటనే క్షణికావేశంలో పురుగుల మందు సేవించగా.. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహానికి మణుగూరు ఏరియా ఆస్పత్రిలో శవ పరీక్షలు నిర్వహించారు.

కుటుంబ సభ్యుల వేధింపులతోనే ఆత్మహత్య

మృతుడి తల్లి ఆరోపణ

పాల్వంచ: కుటుంబ సభ్యుల వేధింపులతోనే తాపీ మేస్త్రీ దాగోర వెంకన్న (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతడి తల్లి సత్యవతి ఆరోపించింది. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని బొల్లేరుగూడేనికి చెందిన తాపీ మేస్త్రీ వెంకన్న బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, వెంకన్న మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటూ భార్య శ్రీలత, కుటుంబ సభ్యులు కొంతకాలంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వేధింపులు తట్టుకోలేక తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సత్యవతి తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో శ్రీలతతో పాటు, బంధువులు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

క్లుప్తంగా

బడ్జెట్ కేటాయింపుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం వరకు నూతన రైల్వే లైన్‌తో పాటు బడ్జెట్ కూడా మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దక్షిణ భారత అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రం వరకూ రైలు మార్గం ఏర్పాటు చేయడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ తనిఖీ


వివరాలు సేకరిస్తున్న భాస్కర్ నాయక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఈ నెల 13న గోదావరి నది మధ్యలో దొరికిన మృతశిశువు, ఆ తర్వాత ప్రమీల అనే యువతి తనకు తెలియకుండా ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు అబార్షన్ చేశారని తీసిన వీడియో వైరల్ కావడంతో గురువారం జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈనేపథ్యాన పట్టణంలోని బ్యాంక్ రోడ్డులో గల అబార్షన్ చేసిన ఆస్పత్రిని సందర్శించి ప్రమీలకు సంబంధించిన కేసు వివరాలతో పాటు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని సీసీ పుటేజీలను సమర్పించాలని ఆస్పత్రి నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీనాయక్, డిప్యూటీ డెమో మొహమ్మద్ ఫైజ్ మోహిఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జింకను కాపాడిన అటవీ సిబ్బంది


ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): మండల పరిధిలోని తిప్పనపల్లి అడవిలో గురువారం ఓ జింకను రెండు కుక్కలు తరుముతున్నాయి. ఈక్రమంలో విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బంది గమనించి వెంబడించారు. జింక సూడిగా ఉండడంతో ఎక్కువ దూరం పరుగెత్తలేక కింద పడగా అటవీ సిబ్బంది ఆ కుక్కలను తరమికొట్టి, వారి వాహనంలో జింకను రామవరంలోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం దానికి ప్రాథమిక చికిత్స చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విజయ, సిబ్బంది రాంప్రసాద్, రమేష్, వాచర్లు, వెటర్నరీ సిబ్బంది ఉన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828